నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, ఆదివారం 18 మే 2025 | WARANGAL

రోడ్డుపై ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

తడిసిన ధాన్యం కొనాల్సిందే..

- అమ్మాపురంలో రోడ్డెక్కిన రైతులు
- ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన

తొర్రూరు, మే 17 : తడిసిన ధాన్యం కొనాలని అన్నదాతలు రోడ్డెక్కారు. తొర్రూరు మండలంలో అమ్మాపురం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిముద్దయింది. దీంతో ఆందోళన చెందిన రైతులు తడిసిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ తొర్రూరు-నర్సంపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. ధాన్యం బస్తాలకు నిప్పుపెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్య, పీఏసీఎస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా రైతులు వారిని నిలదీశారు. దీంతో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు సమస్యలు పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకటరెడ్డి, రైతులు బానోత్ మంగ్య, బానోత్ దస్రు, చంద్రం, సుధాకర్, అశోక్, జగన్, శంకర్, జనార్దన్, సురేశ్, నరసింహా, సుమన్, అశోక్, నరేశ్, గోవిందు, శ్రీను పాల్గొన్నారు.

వసూళ్ల దందా..

తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఏర్పాటు చేసిన 28 కొనుగోలు కేంద్రాల్లో ఒక్కచోట కూడా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తికాలేదు. ఇప్పటి వరకు 5,09,548 బస్తాల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగా, 4,07397బస్తాలు మిల్లులకు తరలించారు. ఇంకా 1,02,151బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే నిలిచిపోయాయి. మరో 4 లక్షల నుంచి 6 లక్షల ధాన్యం బస్తాలను కాంటాలు పెట్టాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రతి క్వింటా ధాన్యానికి రూ.2.50 నుంచి రూ.5 వరకు అధికారులు రైతుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారుగా ఒక్క తొర్రూరు డివిజన్‌లోనే రూ.25 లక్షలు అక్రమ వసూలు చేసినట్లు తెలుస్తున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న అధికారులపై విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తడిసినవి మిల్లులో కొనడం లేదు

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని మిల్లుల్లో కొనడం లేదు. నెల క్రితమే 50 వడ్ల బస్తాలు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాం. ఇప్పటివరకు మిల్లులకు తరలించలేదు. అధికారులను అడిగితే రేపు..మాపు అంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి వడ్లు తడిసిపోయాయి. దీంతో మిల్లుల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని అంటున్నారు. లారీ డ్రైవర్లకు కూడా తడిసిన బస్తాలు తీసుకురావొద్దని చెబుతున్నారు. వాన పడుతుందన్న ఆందోళనతో కొనుగోలు కేంద్రం వద్దే రోజుల తరబడి గడుపుతున్నాం. ప్రభుత్వం స్పందించి తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి. లేదంటే మాకు నష్టం జరుగుతుంది. – గుంటుక రాములు, అమ్మాపురం గ్రామ రైతు

20మంది అరెస్టు.. 8మంది లొంగుబాటు

- మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాల స్వాధీనం
- ములుగు ఎస్పీ శబరీశ్ వెల్లడి

ములుగు, మే 17(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 20మంది మావోయిస్టులను శనివారం ములుగు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అలాగే అజ్ఞాత జీవితం గడుపుతున్న 8మంది మావోయిస్టులు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ఈమేరకు ఎస్పీ పి.శబరీశ్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి అరెస్టయిన మావోయిస్టులను, వారి నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకులు, మందుగుండు సామగ్రితో పాటు లొంగిపోయిన వారి వేర్వేరుగా చూపించి వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లాలోని వెంకటాపురం(నూగూరు), వాజేడు, పేరూరు పోలీస్‌స్టేషన్ల పరిధితో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఎలిమిడి, ఊసూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు చిన్న చిన్న గ్రూప్‌లుగా విడిపోయి అడవిలో సంచరిస్తున్నారని వచ్చిన అందిన సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో గాలించినట్లు అన్నారు. ఈ క్రమంలో శుక్రవారం పాలెంవాగు ప్రాజెక్టు వద్ద ఆరుగురిని, శనివారం ఉదయం వాజేడు పరిధిలోని మురుమూరు అటవీ ప్రాంతంలో ఏడుగురు మావోయిస్టులను, కన్నాయిగూడెం పీఎస్ పరిధిలో గుట్టల గంగారం గొత్తికోయగూడెంలో ఏడుగురిని పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. పాలెంవాగు ప్రాజెక్టు వద్ద ఏరియా కమిటీ సభ్యులు కుంజం లక్క, మారిగల సుమతి, పార్టీ సభ్యులు మడకం కోసి, పొడియం జోగి, మడవి సీమ, ముసాకి రంజులు అరెస్టు అయ్యారని పేర్కొన్నారు. మురుమూరు వద్ద డివిజన్ కమిటీ సభ్యుడు కట్టం భీమ్, ఏరియా కమిటీ సభ్యురాలు మడకం మాసే, పార్టీ సభ్యులు సోడి ఉంగి, వంజాం ముకే, హేమల సుక్కి, కుంజం ఉంగా, పూనెం భీమేలను అరెస్టు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గుట్టల గంగారం గొత్తికోయగూడెంలో ఏరియా కమిటీ సభ్యుడు కట్టం జోగా, పార్టీ సభ్యులు పూనెం భీమే, నుపా గంగి, హేమల సన్నీ, ఊకె మాసా, పొడియం లక్క, ఉండెం సోమడు ఉన్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి మూడు 6 ఎంఎం రైఫిల్, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 303 రైఫిల్, నాలుగు 8 ఎంఎం రైఫిల్, 12 బోర్ వెపన్స్, రెండు గ్రైనేడ్స్, 17 మ్యాగజైన్లు, 180 రౌండ్‌ల బుల్లెట్స్‌తో పాటు రూ. 58,155 నగదు, నాలుగు వాకీటాకీలు, ఆరు రేడియోలు, 9 చార్జింగ్ బ్యాటరీలు, ఆరు పెన్‌డ్రైవ్‌లు, ఆరు మెమోరీ కార్డులు, ఎనిమిది కార్డు రీడర్స్, రెండు కిట్ బ్యాగులు, విప్లవ సాహిత్యం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు. అరెస్టు చేసిన మావోయిస్టులను కోర్టులో ప్రవేశపెట్టి జైలుకు తరలిస్తామని ఎస్పీ తెలిపారు.

అజ్ఞాతం వీడి జనంలోకి..

ములుగు పోలీసుల ఆధ్వర్యంలో 'పోరు కన్నా ఊరు మిన్న' 'మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమాలతో అజ్ఞాతంలో ఉన్న ఎనిమిది మంది మావోయిస్టులు జనంలోకి వచ్చారు. మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యుడు మకం ఐతా, ప్రొటెక్షన్ టీమ్ సీసీఎం ఓయం దేవి, మిలీషియా సభ్యుడు మచ్చకి భామన్, పార్టీ సభ్యులు తాము సన్నీ, కోవాసి దేవి, సోడి ఐతే, మడకం కోసి, మడకం ఐతేలు అజ్ఞాతం వీడి పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు అగ్రనేతల ఆదేశాల మేరకు ఛత్తీస్‌గఢ్‌లో అనేక నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. వీరికి ప్రభుత్వం ప్రకటించిన రివార్డులను త్వరలో అందిస్తామన్నారు. కాగా, ప్రస్తుతం తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోయి ప్రశాంతమైన జీవితం గడపాలని కోరారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, సీఐలు శ్రీనివాస్, కుమార్, ఎస్సైలు ఉన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ శబరీశ్

కాళేశ్వరం రోడ్డులో నిలిచిన వాహనాలు


వీఐపీ ఘాట్ వద్ద ఈదురు గాలులకు కూలిన టెంట్లు

ట్రాఫిక్‌ను క్లియర్ చేయిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

పుష్కర దారిలో ట్రాఫికర్

18 కి.మీ మేర వాహనాలు జామ్.. భక్తులు ఆగమాగం

- మూడో రోజు కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు
- బస్సులు దిగి నడిచివెళ్లిన జనం
- పిల్లాపాపలతో భక్తుల ఇబ్బందులు
- అధికారుల ప్రణాళిక లోపం.. భక్తుల ఆగ్రహం
- చిన్నపాటి వర్షానికే పరిసరాలు అస్తవ్యస్తం, బురదమయమైన రోడ్లు

మహదేవపూర్(కాళేశ్వరం)/పలిమెల, మే 17: మహదేవపూర్ మండలం కాళేశ్వర క్షేత్రంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల్లో అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. భక్తులకు సరిపడా సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. సరస్వతీ పుష్కరాలు శనివారం నాటికి మూడో రోజుకు చేరుకోగా, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పవిత్ర త్రివేణి సంగమం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, నదిలో ప్రత్యేక పూజలు చేశారు. కాళేశ్వరముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. శనివారం ఒక్కరోజే సుమారు లక్ష మందికి పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. స్వామివారి దర్శనానికి సుమారు మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో వేచిఉన్న పలువురు భక్తులు సొమ్మసిల్లి కిందపడిపోయారు.

కిలోమీటర్ల కొద్దీ నిలిచిన వాహనాలు

పెద్ద సంఖ్యలో వచ్చిన వాహనాలతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు 18 కిలోమీటర్ల మేర గంటల కొద్దీ రవాణా వ్యవస్థ స్తంభించింది. దీంతో భక్తులు తీవ్ర అసహనానికి గురయ్యారు. 18 కిలోమీటర్లు ప్రయాణించడానికి ఐదు గంటల సమయం పట్టింది. భారీగా వచ్చిన ప్రైవేట్ వాహనాలను కంట్రోల్ చేయలేకపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు భక్తులు చెబుతున్నారు. అధికారుల ప్రణాళికా లోపం.. సమన్వయం లేకపోవడంపై భక్తులు మండిపడ్డారు. దిక్కులేక బస్సుల్లో నుండి దిగి ఎర్రటెండల్లో నడిచి వెళ్లాల్సి వచ్చిందని, సిరోంచ నుంచి వచ్చే వాహనాలను, మహదేవ్‌పూర్ నుంచి వచ్చి వెళ్లే వాహనాలను ప్రణాళిక ప్రకారం పార్కింగ్ స్థలాలకు పంపడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. మూడవ రోజే ఇలా ఉంటే మిగిలిన తొమ్మిది రోజులు ట్రాఫిక్ సమస్య ఇంకా ఎలా ఉంటుందో అని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ట్రాఫిక్ వలయంలో చిక్కుకోవడంతో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, కలెక్టర్ రాహుల్ శర్మలు స్వయంగా ద్విచక్ర వాహనంపై రోడ్ల వెంట తిరుగుతూ ట్రాఫిక్ సమస్యను క్లియర్ చేయాల్సి వచ్చింది.

ఈవో కార్యాలయం ఎదుట నిలిచిన వరద నీరు

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల పూజలు

కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు పూజలు చేశారు. అంతకు ముందు త్రివేణి సంగమ తీరంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. అలాగే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీఐపీ ఘాట్ వద్ద పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించారు. నదిలో ప్రత్యేక పూజలు చేసి సరస్వతీ మాతను దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరస్వతి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో వర్ధిల్లాలని వేడుకున్నట్లు తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను కూడా సరస్వతీ పుష్కరాల మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. జాప్యం లేకుండా పనులన్నీ ఇప్పటినుంచే త్వరితగతిన పూర్తి చేసుకొని గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినట్లు మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, భూపాలపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మక్కాన్‌సింగ్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, భూపాలపల్లి ఆర్డీఓ రవి, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆర్జేసీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు

2 కి.మీలు నడుచుకుంటే వెళ్లాలి

సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు పార్కింగ్ ప్రదేశాల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినా భక్తుల రద్దీ కారణంగా అవి సరిపోవడం లేదు. దీంతో సుమారు 2 కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సి వస్తున్నది. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందిపడ్డారు. మార్గ మధ్యలో భక్తులకు చలువ పందిళ్లు లేవు. వర్షం కారణంగా రహదారులపై బురద పేరుకుపోయింది. సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఎటు వెళ్లాలో తెలియక భక్తులు తికమక పడాల్సివచ్చింది. – రమాదేవి, భక్తురాలు, గోదావరిఖని

ఆలయం వద్ద క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు

త్రివేణి సంఘంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

గాలివానతో అస్తవ్యస్తం

శుక్రవారం రాత్రి అకాల వర్షంతో కాళేశ్వరం అస్తవ్యస్తంగా మారింది. వీఐపీ ఘాట్ వద్ద భక్తుల కోసం ఏర్పాటుచేసిన పలు టెంట్లు, చలువ పందిళ్లు కూలిపోయాయి. వాటిని అధికారులు సరిచేయించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా రహదారులు బురదమయమై కాలినడకన వెళ్లే భక్తులు నానా యాతన పడ్డారు. ఈదురుగాలులకు భారీ ఫ్లెక్సీలు విరిగి రహదారిపై పడ్డాయి. ఆయా ప్రదేశాల్లో పార్కింగ్ స్థలాలు బురదతో నిండిపోయాయి. కొందరు భక్తులు ఎడ్లబండ్లపై త్రివేణి సంగమానికి చేరుకుని స్నానమాచరించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయాలని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సౌకర్యాలు కరువు..

పుష్కరాలు వచ్చిన భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. వీఐపీ ఘాట్‌కు 3 కిలోమీటర్ల దూరంలోనే వాహనాలను ఆపారు. అక్కడి నుంచి ఘాట్‌కు వచ్చేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం దారుణం. సామాన్య భక్తులను పట్టించుకునే వారే లేరు. కనీసం తాగునీరు అందించలేని పరిస్థితిలో అధికారులున్నారు. – రంజిత్, భక్తుడు, కరీంనగర్

హైవేపై పెరిగిన రద్దీ

టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

కాటారం : కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలతో భూపాలపల్లి –కాటారం మధ్య ప్రధాన జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయింది. కాటారం మండలం మేడిపల్లి టోల్‌ప్లాజా వద్ద సాధారణ రోజులకు మించి రెట్టింపు వాహనాలు వస్తుండడంతో గంటల తరబడి ట్రాఫిక్‌జామ్ అవుతున్నది. దీంతో పుష్కరాలకు వచ్చే భక్తులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టోల్‌ప్లాజా వద్ద సాధారణ రోజుల్లో 3వేల వాహనాలు రాకపోకలు సాగేవని, పుష్కరాలతో వాటి సంఖ్య రోజుకు 5వేల వరకు పెరిగిందని, రద్దీని కట్టడి చేయడం సమస్యగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు.

సరస్వతి ఘాట్ వద్ద నవరత్న మాల హారతి

వీఐపీ ఘాట్ వద్ద నవరత్న మాల హారతి ఇస్తున్న కాశీ వేద పండితులు

కాళేశ్వరంలో సరస్వతి ఘాట్ వద్ద శనివారం కాశీ వేద పండితులు నవరత్న మాల హారతి ఇచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్ సీపీ గౌస్ ఆలం దంపతులు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు.

ఎడ్లమ్మిన పైసలు ఎటుపోయిన యో!

- వడ్ల సంచిలో దాచి పొలం పనులకు వెళ్లిన భర్త
- తెలియక ఆటో అతడికి ధాన్యం అమ్మేసిన భార్య
- రూ.1.50 లక్షలు పోయాయంటూ పోలీసులకు ఫిర్యాదు

పోలీసులు విడుదల చేసిన ఆటో ఫొటో ఇదే

గణపురం, మే 17 : ఎడ్లను అమ్మగా వచ్చిన డబ్బులను భర్త వడ్ల సంచిలో దాచిపెడితే.. ఆ విషయం తెలియక ఆటోలో ధాన్యం కొనుగోలు చేసే వ్యక్తికి డబ్బులు దాచిపెట్టిన వడ్ల సంచిని భార్య అమ్మింది. ఈ ఘటన గణపురం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన రైతు పోతరాజు వీరయ్య తన ఎడ్లను విక్రయించగా రూ.లక్షా 50వేలు వచ్చాయి. వాటిని వీరయ్య ఇంట్లో పాతకాలం నాటి ధాన్యం బస్తాలో దాచిపెట్టి పొలం పనికి వెళ్లాడు. అదే సమయంలో గ్రామంలోకి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆటోలో కొందరు వ్యక్తులు రాగా వీరయ్య భార్య ధాన్యం బస్తాను విక్రయించింది. ఈ క్రమంలో ఇంటికి చేరుకున్న వీరయ్య తాను డబ్బులు పెట్టిన ధాన్యం బస్తా కనిపించకపోవడంతో భార్యను అడగగా, ధాన్యం బస్తాను విక్రయించినట్లు తెలిపింది. అప్పటికే ధాన్యం కొనుగోలు చేసిన వ్యక్తి గ్రామం నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఖంగుతిన్న భర్త లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు కొనుగోలు చేయాలని ధర్నా

రహదారిపై రైతుల రాస్తారోకో

చాగల్లులో జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

స్టేషన్ ఘన్‌పూర్, మే 17: క్వింటాలుకు రూ.18వేలు వస్తాయని నమ్మబలికి, పొగాకు సాగు చేయించి, తీరా, పంట చేతికొచ్చాక కొనుగోలు చేయకపోవడంతో పొగాకు రైతులు రోడ్డెక్కారు. తాము తీవ్రంగా నష్టపోతాయని ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. శనివారం మండలంలోని చాగల్లు జాతీయ రహదారిపై పొగాకు రైతులు తమ పంటను డెక్కన్, వీఎస్‌టి కంపెనీలు కొనుగోలు చేయాలని రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు నాలుగు వందల మంది రైతులం పొగాకు సాగు చేశామని, ఒక్కో రైతుకు పది నుంచి 40వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. ఎకరాకు రూ.18వేల వరకు ధర వస్తుందని, గత సీజన్‌లో వీఎస్‌టీ కంపెనీకి చెందిన రమేశ్ రైతులను నమ్మబలికి పొగాకు నారు ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఒక్కో రైతు వద్ద 10 నుంచి 12 క్వింటాళ్ల పొగాకు ఉన్నదని, వీఎస్‌టీ, డెక్కన్ కంపెనీలు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 1,015 ఎకరాలు పొగాకు సాగు చేయగా, ఎకరానికి సుమారు 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. చాగల్లు క్లస్టర్ పరిధిలోని మూడు గ్రామాల్లో 500 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. చాగల్లు క్లస్టర్ పరిధిలో సుమారు 5వేల క్వింటాళ్ల పొగాకు దిగిబడి వచ్చినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు వడ్లకొండ యాదగిరి, పొన్నబోయిన రాజు, పంచల యాకయ్య, బాస్కుల యాదగిరి, ఐలయ్య, కొంతం చంద్రమౌళి, గరిదాసు సంజీవ, శేషు పాల్గొన్నారు.

పొగాకును కాపాడుకోలేక పోతున్నాం..

ఎకరానికి రూ.18వేలు వస్తాయని చెప్పడంతో ఆశపడి ఎకరానికి రూ.60 నుంచి రూ.70వేల వరకు పెట్టుబడి పెట్టి పొగాకు సాగు చేశా. దిగుబడి చూసి సంతోషపడ్డాం. కానీ పొగాకు కొనేవారు లేరు. మార్చి వరకే కొనుగోళ్లు పూర్తి కావాల్సి ఉండగా, పటించుకోవడం లేదు. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల పొగాకు బోర్డు చైర్మన్ లిమిట్‌గా పొగాకును సాగు చేయాలని చెప్పిన విషయాన్ని తమకు తెలియజేయలేదు. వీఎస్‌టీ కంపెనీ పొగాకును కొనుగోలు చేయడంలేదు. డెక్కన్ కంపెనీ కొంటామని చెప్పింది. చివరికి 2 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. ప్రభుత్వం స్పందించి కంపనీలు పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. – ఆకుల నర్సింగం, పొగాకు రైతు, చాగల్లు